సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 25 । జులై । 2025



ప్రజాధనం వృథా

బాన్సువాడ బల్దియాలో లక్షలాది రూపాయ లు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనాలు.. మరమ్మతులు లేక మూలనపడుతున్నాయి.

- 9లో ▸



చదవడం, రాయడం రావాలి

స్కూల్ కాంప్లెక్స్ స్థాయి సమావేశాలు నిర్వ హించారు. వెనకబడిన విద్యార్థులపై దృష్టిసా రించాలని ఎంఈవోలు సూచించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం

32.0 /21.4

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి'



నస్రుల్లాబాద్ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ చందర్ నాయక్ ఆదేశించారు. గురువారం నస్రుల్లాబాద్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారుల సంఖ్యను పెంచి ఇళ్ల నిర్మాణం చేపట్టేలా పంచాయతీ కార్యదర్శులు పనిచేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పాల్గొన్నారు. ఓటరు జాబితాను పరిశీలించారు. అనంతరం గిరిజన గురుకుల బాలుర పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి రాజేష్, గిరిజన గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ మాధవరావు, పంచాయతీ కార్యదర్శులు సవిత, సాయిలు, సౌందర్య తదితరులున్నారు.

డాక్టర్ వి.శంకర్‌కు సినారె పురస్కారం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.శంకర్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా సాహిత్య సంస్థల సమాఖ్య మహాకవి సినారె సాహితీ పురస్కారానికి ఎంపిక చేసింది. ఆయన కవి, రచయిత, పరిశోధకులు, అధ్యాపకులుగా అందిస్తున్న బహుముఖ సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈనెల 27న భువనగిరిలో నిర్వహించే కార్యక్రమంలో శంకర్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

పోచారంలోకి ఇన్‌ఫ్లో

నాగిరెడ్డిపేట : ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టులోకి గురువారం వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ఎగువన ఉన్న లింగంపేట, గుండారం వాగుల ద్వారా ప్రాజెక్టులోకి 1,513 క్యూసెక్కుల నీరు వస్తోందని ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.820 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.386 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

'ఎరువు ఎక్కువైతే భూసారం దెబ్బతింటుంది'

భిక్కనూరు : రైతులు పంటల సాగులో మోతాదుకు మించి ఎరువులు వాడితే భూసారం దెబ్బతింటుందని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మార్కెటింగ్ అధికారి అజ్మీర రాజు పేర్కొన్నారు. గురువారం ఆయన భిక్కనూరు సింగిల్‌విండోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసే పంటలకు సరిపోయే మోతాదులోనే ఎరువులు ఇవ్వాలని సూచించారు. రైతులు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. ఆయన వెంట విండో చైర్మన్ భూమయ్య, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, డీఏవో మోహన్‌రెడ్డి, ఏడీఏ అపర్ణ, డీసీవో రామ్మోహన్, ఏడీఎం రమ్య, ఏవో నరేందర్, ఏఈవో వినోద్ ఉన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో 'డయల్ యువర్ ఆర్టీసీ' కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆర్‌ఎం జ్యోత్స్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలను ఫోన్ చేసి తెలపాలని పేర్కొన్నారు.

నిజామాబాద్, ఆర్‌ఎం	: 99592 26011
బాన్సువాడ డీఎం	: 99592 26020
కామారెడ్డి డీఎం	: 99592 26018

రోడ్ల మీదే మార్కెట్లు!

అర్ధంతరంగా నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు



పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా ఉంది కామారెడ్డి పట్టణ పరిస్థితి. జిల్లా కేంద్రంగా మారినా.. మౌలిక సదుపాయాలు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయి. పట్టణంలో సరైన మార్కెట్లు లేకపోవడంతో కూరగాయలను రోడ్లమీదే విక్రయించాల్సి వస్తోంది.

- జిల్లా కేంద్రంలో నిరుపయోగంగా రైతుబజార్
- పిల్లర్ల దశ దాటని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం
- సౌకర్యాలు కల్పించకున్నా తైబజార్ వసూలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : డెయిలీ మార్కెట్‌లో నిర్మించిన మడిగెలన్నీ దళారులు, వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాయి. అది పేరుకే కూరగాయల మార్కెట్.. కానీ మడిగెలన్నీ కిరాణ దుకాణాలతో నిండిపోయాయి. కూరగాయలు అమ్మేవారు, రైతులు ఏదో ఒక దుకాణం ముందు కూర్చుని అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుభాష్‌రోడ్డులో, తిలక్‌రోడ్డులో నో పార్కింగ్ పేరుతో బోర్డులు తగిలించారు. దీంతో ఆ రోడ్లపై కూరగాయలు అమ్మే పరిస్థితి లేదు. కొత్త బస్టాండ్ సమీపంలోని చర్చి గ్రౌండ్‌లో రైతులు వచ్చి కూరగాయలు అమ్ముకుంటారు. వానకు నానుతూ, ఎండకు ఎండుతూ కూరగాయలు అమ్ముకోవాల్సి రావడంతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. కాగా ఆదివారం వ్యాపారాలు మూసి ఉంటాయి. దీంతో రైతులంతా సుభాష్‌రోడ్డులో ఇరువైపులా కూర్చుని కూరగాయలు అమ్ముతారు. అక్కడ కూడా ఎలాంటి సౌకర్యాలులేవు. ప్రతి గురువారం నడిచే అంగడి (వార సంత)లో కూడా కనీస సౌకర్యాలు లేవు. కనీసం మూత్రశాలలు లేకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అసంపూర్తిగా...

కూరగాయలతో పాటు ఫిష్, మటన్ మార్కెట్లు అన్నీ ఒకేచోట ఉండాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో పట్టణాల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారు. అందులో భాగంగా కామారెడ్డిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు నిధులు మంజూరవగా.. స్థానిక గాంధీ గంజ్‌లో నిర్మాణం మొదలు పెట్టారు. అయితే నిధుల లేమితోపాటు చేసిన పనులకు బిల్లులు రాక అది పిల్లర్ల దశలోనే ఆగిపోయింది. ప్రస్తుతం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్థలం వాహనాల పార్కింగ్‌కు, చెత్త వేయడానికి ఉపయోగపడుతోంది.



డెయిలీ మార్కెట్‌లో దుకాణాల ముందు కూరగాయల విక్రయాలు..

జబర్దస్తీగా వసూళ్లు..

కూరగాయలు అమ్మడానికి మార్కెట్లు లేకపోవడంతో రైతులు రోడ్ల మీద ఎక్కడో ఓచోట కూర్చుని అమ్ముకుని వెళుతుంటారు. వారికి ఎలాంటి సౌకర్యాలు కల్పించరు. కానీ తైబజార్ మాత్రం వసూళ్ల జబర్దస్తీగా నడుస్తున్నాయి. బల్దియాను గుప్పిట పెట్టుకుని కొందరు తైబజార్ వసూళ్లకు సంబంధించి కాంట్రాక్టు పొంది ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు. గంపకు రూ. 10 చొప్పున ఇవ్వాల్సిందే. రైతులకు తాగునీటి సౌకర్యం, కూర్చునేందుకు షెడ్లు, మూత్రశాలలు వంటి కనీస సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా అవేమీ పట్టించుకోవడం లేదు. కానీ తైబజార్ మాత్రం వసూలు చేస్తారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో రైతు బజార్ నిరుపయోగంగా ఉన్నా, రోడ్లమీదే కూరగాయలు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉన్నా, ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోయినా, ముక్కుపిండి తైబజార్ వసూలు చేస్తున్నా ఇటు అధికార పక్షం నేతలుగాని, అటు ప్రతిపక్షాలు కానీ పట్టించుకోవడం లేదు. రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకువచ్చే ప్రయత్నం అధికారులు సైతం చేయడం లేదు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం పనులను పూర్తి చేయించడానికి ఎవరూ చొరవ చూపడం లేదు. ఇప్పటికైనా అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

వృథాగా రైతు బజార్

పట్టణంలోని గాంధీ గంజ్‌లో రైతు బజార్ నిర్మించారు. అయితే మార్కెట్‌ను ఇక్కడికి తరలించకుండా కొందరు అడ్డుతగిలారు. కూరగాయల మార్కెట్ తరలివెళ్తే ఇతర వ్యాపారాలపై ప్రభావం పడుతుందన్న అంచనాలతో ప్రస్తుత డెయిలీ మార్కెట్ ప్రాంత వ్యాపారులు అధికారులు, నాయకులను మేనేజ్ చేసి రైతుబజార్‌కు తరలించకుండా అడ్డుకున్నారన్న ఆరోపణలున్నాయి. దీంతో రైతుబజార్ వృథాగా ఉంటూ తాగుబోతులకు అడ్డాగా మారింది.



వృథాగా ఉంటున్న రైతుబజార్

మోగనున్న పెళ్లి బాజా

నేటి నుంచి శ్రావణ మాసం ✣ రేపటినుంచి శుభ ముహూర్తాలు




సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఆషాఢం ముగిసింది. శుక్రవారం శ్రావణ మాసం ప్రారంభమైంది. ఈ మాసం వస్తూవస్తూ ఎన్నో శుభ ముహూర్తాలను తెచ్చింది. సుమారు రెండు నెలలుగా సుముహూర్తాలు లేకపోవడంతో పెళ్లిళ్లు నిలిచిపోయాయి. దీంతో శ్రావణమాసం ఎప్పుడొస్తుందా అని చాలా మంది వేచి చూస్తున్నారు. శనివారం నుంచి పెళ్లి ముహూర్తాలు ఉన్నాయని వేద పండితులు చెబుతున్నారు. ఈనెల 26, 30, 31 తేదీలతోపాటు వచ్చేనెల 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17 తేదీలలో జిల్లాలో వేలాది పెళ్లిళ్లు జరగనున్నాయని పేర్కొన్నారు. ఆ తర్వాత భాద్రపద మాసంలో శుభముహూర్తాలు ఉండవని, సెప్టెంబర్ నాలుగో వారంనుంచి నవంబర్ చివరి వరకు వివాహాది శుభకార్యాలకు ముహూర్తాలు ఉంటాయని చెబుతున్నారు. ఇప్పటికే చాలామంది పెళ్లిళ్ల, ఇతర శుభకార్యాలకు ముహూర్తాలు నిశ్చయించుకుని ఉన్నారు. శ్రావణమాసం ప్రారంభం కావడంతో జిల్లా అంతటా పెళ్లి కళ కనిపిస్తోంది. వ్యాపారాలూ కళకళలాడనున్నాయి. బట్టలు, ఫర్నీచర్, కిరాణం, బంగారం... ఇలా ఆయా వ్యాపారాలు జోరందుకోనున్నాయి. అయితే ముహూర్తాల సమయంలో బంగారం ధరలు మరింత పెరగడం కొనుగోలుదారులను ఆందోళనకు గురిచేస్తోంది.

శ్రావణమాస శోభ..

శ్రావణ మాసానికి ఆధ్యాత్మికంగా ప్రాధాన్యత ఉంది. ఈ మాసం శివకేశవులతోపాటు పార్వతి దేవికి, శ్రీమహాలక్ష్మికి ప్రీతికరమైనదిగా భావిస్తారు. ఈ నేపథ్యంలో నెలంతా ఆలయాలలో సందడి నెలకొననుంది. మంగళగౌరి, వరలక్ష్మి వ్రతాలతో ప్రతి ఇల్లూ కోవెలను తలపించనుంది.

నేడు లింగంపేటలో ఆత్మగౌరవ గర్జన

- సభకు హాజరుకానున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- భారీ జన సమీకరణపై పార్టీ నేతల దృష్టి



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట మండల కేంద్రంలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆత్మగౌరవ గర్జన సభ నిర్వహించనున్నారు. దీనికి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా భారీ జన సమీకరణపై నేతలు దృష్టి సారించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరయ్యేలా చూస్తున్నారు. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో సభకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కేటీఆర్ పర్యటన ఇలా..

మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి బయలుదేరి కామారెడ్డి మీదుగా లింగంపేటకు చేరుకుంటారని బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారని పేర్కొన్నారు. అనంతరం లింగంపేట మాజీ ఎంపీపీ ముదాం సాయిలు ఇంటికి వెళ్తారు. అక్కడి నుంచి ఎల్లారెడ్డికి వెళ్లి పార్టీ నాయకుడి కుమారుడి వివాహ వేడుకలో పాల్గొంటారు. తర్వాత నాగిరెడ్డిపేట మండల కేంద్రానికి వెళ్లి చేరుకుని, అక్కడ భోజనం చేసి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన కేటీఆర్ పర్యటనతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

సభను విజయవంతం చేయాలి

కామారెడ్డి టౌన్: లింగంపేటలో శుక్రవారం నిర్వహించే బీఆర్‌ఎస్ ఆత్మగౌరవ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నర్సన్నపల్లి వద్ద కేటీఆర్‌కు స్వాగతం పలికి అక్కడి నుంచి వాహనాల ర్యాలీతో లింగంపేట వరకు వెళ్తామని పేర్కొన్నారు.

రేపు జాబ్‌మేళా

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామర్స్ ల్యాబ్‌లో శనివారం ఉదయం 9 గంటలకు సాఫ్ట్‌వేర్ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించే మేళాకు ఇంటర్‌లో ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, బైపీసీ, ఒకేషనల్ కంప్యూటర్స్ కోర్సులు చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 80740 65803, 79818 34205 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జిల్లా ఆస్పత్రిలో ఊడిపడిన పెచ్చులు



ఎల్లారెడ్డిపల్లె దవాఖానాలో ఊడి పడిన పైకప్పు పెచ్చులు..



జీజీహెచ్‌లో...

- ఇద్దరికి స్వల్పగాయాలు

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి భవనంలో గురువారం మధ్యాహ్నం పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. రక్తనమూనాలు సేకరించే విభాగం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఆ సమయంలో అక్కడ ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పాత భవనం కావడంతో పెచ్చులూడి పడ్డాయని జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. మరమ్మతులు చేయిస్తామన్నారు.

ఎల్లారెడ్డి పల్లె దవాఖానాలో..

ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డి పట్టణంలోని పల్లె దవాఖానాలో బుధవారం రాత్రి పెచ్చులూడి పడ్డాయి. అయితే ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఉన్నతాధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం

తాడ్వాయి: దేమికలాన్ గ్రామంలో వైద్య శిబిరం కొనసాగుతోంది. గ్రామానికి చెందిన పలువురు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. ఇందులో ఇద్దరు మృత్యువాతపడ్డారు. ఈ నేపథ్యంలో స్పందించి అధికారులు గ్రామంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బుధవారం ఆరుగురిని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన వైద్యులు.. గురువారం మరో ముగ్గురిని పంపించారు. గురువారం మరో 25 మందికి మందికి వైద్య పరీక్షలు చేశారు. వాంతులు, విరేచనాలు ఎందుకు అవుతున్నాయో తేలకపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

మిషన్ భగీరథ సీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఈ రాజేందర్‌కుమార్, డీఈ ప్రవీణ్‌రెడ్డి, ఏఈ ప్రశాంత్, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఆర్డీవో వీణ, మండల వైద్యాధికారి ఖాసిం గురువారం గ్రామంలో పర్యటించి పరిస్థితిని తెలుసుకున్నారు. తాగునీరు శాంపిళ్లను సేకరించి పరీక్షల కోసం పంపించామని డీఎంహెచ్‌వో తెలిపారు. శనివారం ఫలితాలు వస్తాయన్నారు. ప్రజలకు జాగ్రత్తలను వివరించారు.



దేమికలాన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో

డయేరియా నివారణకు చర్యలు

కామారెడ్డి టౌన్ : జిల్లాలో డయేరియా నివారణకు చర్యలు చేపడుతున్నట్లు డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆర్డీవో వీణతో కలిసి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులతో మాట్లాడారు. దేమికలాన్‌లో తొమ్మిది మంది డయేరియాతో బాధపడుతుండగా.. వారికి జీజీహెచ్‌లో వైద్యం అందించామని డీఎంహెచ్‌వో తెలిపారు. ఇందులో ఆరుగురిని డిశ్చార్జి చేశామని, మిగతా ముగ్గురి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు.



జీజీహెచ్‌లో బాధితురాలితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, ఆర్డీవో వీణ

అటవీ భూముల ఆక్రమణలను ఉపేక్షించం

- డివిజినల్ అటవీ అధికారి సునీత
- కాటేపల్లి తండాలో ఆక్రమణల తొలగింపు

పెద్దకొడప్‌గల్ : అటవీ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని డివిజినల్ అటవీశాఖ అధికారి(డీఎఫ్‌వో) సునీత హెచ్చరించారు. కాటేపల్లి తండా శివారులో కబ్జాకు గురైన అటవీ భూములను గురువారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సాగు చేస్తున్న పంటలను పొక్లెయిన్‌ల సహాయంతో చదును చేయించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో సునీత మాట్లాడుతూ కాటేపల్లి తండా శివారులోని 275, 118 సర్వే నంబర్లలో 1700 ఎకరాల్లో అటవీ భూములున్నాయని, అందులో 80 ఎకరాల వరకు కబ్జాకు గురైందని పేర్కొన్నారు. కబ్జాకు గురైన భూముల్లోని పది హెక్టార్లలో మొక్కలు నాటుతామని, మిగతా భూములకు ట్రెంచ్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం స్థానికులు మాట్లాడుతూ తండా పరిధిలో కబ్జాకు గురైన 250 నుంచి 300 ఎకరాల భూములను స్వాధీనం చేసుకోవాలని, లేకపోతే మొత్తం వదిలేయాలని కోరారు. లేదంటే మళ్లీ ఆక్రమించుకుంటామన్నారు. పిట్లం ఎఫ్ఆర్‌వో రవికుమార్, సీఐ రవికుమార్, బిచ్కుంద, పిట్లం, మద్నూర్, పెద్దకొడప్‌గల్ ఎస్సైలు మోహన్‌రెడ్డి, రాజగౌడ్, విజయ్ కొండ, అరుణ్‌కుమార్ తదితరులున్నారు.



అటవీ భూముల్లోని పంటలను పొక్లెయిన్‌ల సహాయంతో తొలగిస్తున్న దృశ్యం



పంటలను తొలగించి అటవీ భూములను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

ఇరవై ఏళ్లుగా పండిస్తున్నాం..



మాకు రెండెకరాల భూమి ఉంది. రూ. లక్ష పెట్టుబడి పెట్టి పత్తి సాగు చేస్తున్నాం. 20 ఏళ్లుగా ఈ భూమిలోనే పంట పండిస్తున్నాం. ఇప్పుడొచ్చి భూమిని స్వాధీనం చేసుకుంటున్నారు. మేము ఎలా బతకాలి.

– పంకా బాయి, రైతు, కాటేపల్లి తండా

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



గాంధారి సీహెచ్‌సీలో రోగితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

గాంధారి : సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. గురువారం ఆయన గాంధారి సీహెచ్‌సీని సందర్శించి రోగులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న వైద్య సేవలు, మందుల లభ్యత వివరాలు తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు చేస్తున్నందుకు వైద్యాధికారులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇది వ్యాధుల కాలం కాబట్టి వైద్యులు 24 గంటలు అప్రమత్తంగా ఉండి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను ఆస్పత్రికి అనుసంధానించి శుద్ధమైన నీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ ఏఈని ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటాలని ఎంపీడీవో రాజేశ్వర్‌కు సూచించారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటారు. కళాశాల ఆవరణలో ఇంకుడు గుంత నిర్మాణాన్ని ప్రారంభించారు. కళాశాలకు వివిధ ప్రాంతాల నుంచి రావడానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదని విద్యార్థులు కలెక్టర్‌తో పేర్కొనగా.. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కేజీబీవీని సందర్శించి విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమాలలో ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి, డీఆర్డీవో సురేందర్, ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం, తహసీల్దార్ రేణుక చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

తిప్పారం వాగు సందర్శన..

గాంధారికి సమీపంలోని తిప్పారం వాగుపై ఉన్న లోలెవెల్ బ్రిడ్జిని కలెక్టర్ పరిశీలించారు. గతేడాది వరదలు వచ్చినప్పుడు బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహించి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధిక వర్షాలు కురిసినప్పుడు జిల్లాలో ప్రమాదకరంగా వాగులు ప్రవహించే 38 ప్రాంతాలను గుర్తించామన్నారు. వాటిలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 12 ప్రాంతాలున్నాయన్నారు. ఆయా ప్రాంతాలలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



తిప్పారం వాగుపై బ్రిడ్జిని పరిశీలిస్తున్న కలెక్టర్

క్లుప్తంగా

వార్డులవారీగా ఓటర్ జాబితాను రూపొందించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వార్డుల వారీగా ఓటర్ జాబితాను రూపొందించి ఆన్‌లైన్ చేయాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓటర్ జాబితా రూపకల్పనలో ఎలాంటి తప్పులు జరగకుండా చూడాలని చెప్పారు. నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సవరణ పకడ్బందీగా చేపట్టాలి

దోమకొండ: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వార్డుల వారీగా ఓటర్ల సవరణ పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల సవరణ తీరును ఆయన పరిశీలించి పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ప్రతి వార్డులో వార్డుల వారీగా ఓటర్ల సవరణ జరుగుతుందని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా చూడాలన్నారు. ఎంపీవో ప్రవీణ్ కుమార్, సూపరింటెండెంట్ మనోహర్, కార్యదర్శులు యాదగిరి, సౌందర్య, సంతోష్‌కుమార్, అంజయ్య పాల్గొన్నారు.

కలకలం రేపుతున్న చిరుత పులుల దాడులు

- వరుస దాడులతో బెంబేలెత్తుతున్న పశువుల కాపరులు
- వారంలో నాలుగు ఘటనలు
- పులి కోసం కొనసాగుతున్న గాలింపు

రామారెడ్డి: మండలంలో చిరుత పులుల దాడులు కలకలం సృష్టిస్తున్నాయి. గత పది రోజుల్లో నాలుగు ఘటనల్లో 2 లేగ దూడలు, రెండు మేకలు మృత్యువాత పడ్డాయి. మరోవైపు 11 రోజుల క్రితం రామారెడ్డి మండలం స్కూల్ తండాలో పెద్దపులి దాడిలో ఆవు మృతి చెందింది. కన్నాపూర్ తండా, గోకుల్ తండా, తాజాగా బుధవారం ఇసన్నపల్లి శివారులో మేకల మందపై చిరుతపులి దాడి చేసి రెండు మేకలను ఎత్తుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. మండలంలో పెద్దపులి సంచారంతో ఆగమవుతున్న జనాలకు వరుసగా చిరుత పులి దాడులు పశువులు, గొర్ల కాపరులను కలవరానికి గురి చేస్తున్నాయి. అన్నారంలో పులి దాడి జరిగిందని అనుకున్నప్పటికీ.. అది నక్క అని అటవీ శాఖాధికారులు నిర్ధారించారు.



గోకుల్‌తండాలో చిరుత దాడిలో మృతి చెందిన ఆవు కళేబరాన్ని దహనం చేస్తున్న దృశ్యం(ఫైల్)

నష్టపరిహారంపై స్పష్టత కరువు..

అటవీ జంతువుల దాడిలో మరణించిన పశువులు, గొర్రెలు వయసు ఆధారంగా ప్రభుత్వం పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. లేగ దూడల నుంచి ఆవులు, గొర్రెలు మేకలకు వయసును బట్టి నష్ట పరిహారం చెల్లిస్తారు. మూగజీవాలు, మనుషులపై జరిగే దాడులకు సంబంధించిన నష్ట పరిహారం తాలుకా వివరాలను మాచారెడ్డి ఇన్‌చార్జి ఎఫ్ఆర్‌వో రమేష్‌ను సాక్షి వివరణ కోరగా నష్ట పరిహారానికి సంబంధించి స్పష్టత ఇవ్వలేదు. మనుషులపై అటవీ జంతువుల దాడులకు సంబంధించిన నష్ట పరిహారం వివరాలు తెలియదని, మూగ జీవాల వయసును బట్టి వస్తాయని తెలిపారు. అయితే 11 రోజులుగా పెద్దపులి ఆచూకీ కోసం ఆపరేషన్ కొనసాగుతుందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

నష్టపరిహారం ఇప్పించాలి



చిరుత పులి దాడి చేసి మా ఆవును చంపేసింది. రూ.35 వేల నుంచి 40 వేల వరకు నష్టం జరిగింది. నష్టపరిహారం ఇప్పించాలి. అధికారులు స్పష్టత ఇవ్వాలి.

–బాదావత్ పూల్యానాయక్, గోకుల్‌తండా

రోడ్లపై వెతికితే ఎలా దొరుకుతుంది?



అడవి లోపలికి వెళ్లి వెతికితే పులి ఆచూకీ దొరికే అవకాశం ఉంది. కానీ అటవీ శాఖాధికారులు రోడ్ల పక్కన వెతికితే పులి ఆచూకీ ఎలా దొరుకుతుంది. నిత్యం ఏదోచోట చిరుత పులులు దాడులు చేస్తూనే ఉన్నాయి. జీవాలను మేతకు తీసుకెళ్లాలంటే భయపడుతున్నారు.

–బుచ్చిరెడ్డి, స్కూల్‌తండా

అరుదైన జానపద నృత్య రూపకం 'చిందు'

మీకు తెలుసా?

ఆర్మూర్: అరుదైన జానపద నృత్యరీతిగా గుర్తింపు తెచ్చుకున్న చిందులు మన తెలంగాణలోనే కనబడతారు. కొన్నేళ్ల కిందట ఈ కళను నమ్ముకొని నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, వరంగల్, నల్గొండ జిల్లాల్లో సుమారు ఐదువేల కుటుంబాలు జీవనం సాగించేవి. ఒక్క ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనే ఆర్మూర్, భీమ్‌గల్, బాల్కొండ, బోధన్, బాన్సువాడ ప్రాంతాలలో రెండు వేల మంది కళాకారులు ఉండేవారని అంచనా.

- హరిజనులలో ఒక తెగ అయిన మాదిగ వారిని అడుక్కోవడానికి చిందులు వేసేవారే ఈ చిందు కళాకారులు లేదా చిందు మాదిగలు.
- వీరు ప్రదర్శించే యక్షగానం పేరే చిందు భాగోతం లేదా చిందు భాగవతం.



1986లో ఢిల్లీలో అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ దంపతులతో జిల్లా చిందు కళాకారులు (ఫైల్)

- చిందు కళాకారుల రామాయణ, మహాభారత, భాగవతాలలో ప్రధాన ఘట్టాలను రంగస్థలంపై ప్రదర్శించేవారు.
- ప్రస్తుతం రంగస్థల ప్రదర్శనలు కనుమరుగకావడంతో, వారు చిందు ప్రదర్శనలను తగ్గించారు.

పాత ఫోన్లు కొనేటప్పుడు జాగ్రత్త..

సమాచారం..

ఖలీల్‌వాడి: తక్కువ రేటుకు మంచి సెల్ ఫోన్లు వస్తున్నాయని చాలా మంది పాతవి కొనుగోలు చేస్తుంటారు. కానీ ఈ ఫోన్లు తీసుకునేటప్పుడు జాగ్రత్తలు తీసుకోకుంటే ఇబ్బందుల్లో పడక తప్పదు. ప్రతి సెల్‌ఫోన్‌కు ఐఎంఈఐ నెంబర్ ఉంటుంది. గతంలో ఏదైనా నేరాలకు పాల్పడిన వారు ఫోన్‌ను విక్రయిస్తే, కొనుగోలు చేసినవారు ఇబ్బందులు పడతారు. అలాగే కొందరు సెల్ ఫోన్లను చోరీ చేసి తక్కువ ధరకు అమ్ముతుంటారు. వీటిని కొన్న తర్వాత పోలీసు సమస్యలు రావచ్చు. ఎప్పుడైనా పాత ఫోన్ కొనేటప్పుడు వారి పూర్తి వివరాలు, చిరునామా తీసుకోవాలి. అలాగే లిఖిత పూర్వకంగా పత్రం రాసుకొని తీసుకుంటే కొంత మేర ఇబ్బందులు తప్పే అవకాశాలు ఉంటాయి.

పాఠశాల నూతన భవన నిర్మాణానికి కృషి

- సబ్ కలెక్టర్ కిరణ్మయి



ఇస్లాంపురా పాఠశాలను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ: పట్టణంలోని ఇస్లాంపురా ఉర్దూ మీడియం, తెలుగు మీడియం యూపీఎస్ నూతన భవన నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదించామని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. గురువారం ఇస్లాంపుర కాలనీ, అరాఫత్ కాలనీ, వీక్లీ మార్కెట్‌లోని పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరినందున వాటిని కూల్చివేసి వాటి స్థానంలో కొత్త భవనాలను నిర్మించేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని అన్నారు. ఆమె వెంట మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు ఉన్నారు.

హోటళ్లలో తనిఖీలు

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని హోటళ్లు, బేకరీలు, స్వీట్‌హోంలలో గురువారం మున్సిపల్ కమిషనర్ ఖయ్యూం తనిఖీ చేశారు. పరిశుభ్రత పాటించకపోవడంతో ఒకొక్కరికి రూ.500 వరకు జరిమానా విధించారు. జరిమానా రూపంలో మొత్తం రూ.8 వేల నగదు వచ్చాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు శుభ్రత పాటించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

భిక్కనూరు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని యూనిసెఫ్ ప్రతినిధులు గురువారం సందర్శించారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను పరిశీలించి వారి తల్లులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. యూనిసెఫ్ ప్రతినిధి, రాష్ట్ర పోషకాహార నిపుణుడు క్యాది, రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ రేష, కో–ఆర్డినేటర్లు మోహన్, విజయపాల్ పాల్గొన్నారు.

ముగ్గులు, వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కామారెడ్డి అర్బన్: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సంబురాల సందర్భంగా కామారెడ్డి డిపోలో నిర్వహించిన వ్యాసరచన, ముగ్గుల పోటీల్లో కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. ముగ్గుల పోటీలో విద్యార్థులు భార్గవి, మానస, వ్యాసరచనలో రోజా, శ్రీశ్రేయ, అభిజ్ఞలు తమ ప్రతిభను కనబర్చి బహుమతులు పొందగా వీరిని గురువారం కళాశాల ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ కె.కిష్టయ్య, అధ్యాపకులు విశ్వప్రసాద్, సుధాకర్, జయప్రకాష్, శ్రీనివాస్, శ్రీవల్లి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం '90 డేస్ మీడియేషన్ డ్రైవ్ ఫర్ ది నేషన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్‌ఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ.. కేసుల సంఖ్య, న్యాయ వ్యవస్థపై భారం తగ్గించాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వ విధానాల గురించి వివరించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. సంస్థ కార్యదర్శి టి.నాగరాణి, న్యాయవాదులు సుమలత, సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నంద రమేష్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాయం కోసం మహిళ నిరసన

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలోని కామప్ప చౌరస్తా వద్ద నల్లజెరు జ్యోతి అనే మహిళ గురువారం తనకు న్యాయం చేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేసింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీర్కూర్ గ్రామానికి చెందిన నర్ర సాయిలు తనతో 16ఏళ్లుగా సహజీవనం చేశాడన్నారు. ఈక్రమంలో తనకు కుమారుడు జన్మించగా, బాన్సువాడలో ఇల్లు కట్టించి న్యాయం చేస్తానని అతడు నమ్మించి, మోసం చేసినట్లు ఆరోపించింది. పలుమార్లు కుల పంచాయితీ పెట్టించగా రూ.5లక్షలు జీవనభృతిగా ఇస్తానని చెప్పి, ఇవ్వకుండా మోసం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. తనను ఇబ్బంది పెడితే చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఆరోపించింది. న్యాయం చేయాలని కోరుతూ బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి ఫిర్యాదు అందించానని తెలిపారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు



మద్నూర్‌లో తిరుగుతున్న కుక్కలు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలో కుక్కల సంచారం ఎక్కువగా ఉండడంతో గ్రామస్తులు భయపడుతున్నారు. ఐదు రోజుల క్రితం మండల కేంద్రంలో ఎనిమిది మందిపై పిచ్చి కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలై ఆస్పత్రుల పాలయ్యారు. గతంలో సైతం కుక్కల దాడిలో పలువురు తీవ్ర గాయాలతో ఆస్పత్రులలో చేరిన ఘటనలున్నాయి. అధికారులు, జీపీ సిబ్బంది చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

29న 'మోడల్'ఎంట్రన్స్ పరీక్ష

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట మోడల్ స్కూల్ 6వ తరగతిలో ఖాళీగా ఉన్న ఒక సీటు భర్తీ కోసం ఈ నెల 29న ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించనున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ రాంప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు పాఠశాలలో 29న ఉదయం 10గంటలకు నిర్వహించే ఎంట్రన్స్ పరీక్షకు హాజరు కావాలని సూచించారు. ఎంట్రన్స్ పరీక్షలో ఇంగ్లిష్, గణితం, సైన్స్‌తోపాటు ఇతర సామాజిక విషయాలపై ప్రశ్నలుంటాయని తెలిపారు. మెరిట్ ఆధారంగా సీటును భర్తీ చేస్తామని చెప్పారు.

కరపత్రాలు ఆవిష్కరణ



లింగంపేట(ఎల్లారెడ్డి): స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి సీఐ రాజారెడ్డి లీగల్ సర్వీసెస్ అథారిటీ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుటుంబ తగాదాలు, సీనియర్ సిటిజన్ సమస్యలు, చైల్డ్ మ్యారేజ్, చైల్డ్ పొటెక్షన్, పోక్సో, డ్రగ్స్ తదితర సమస్యలు లీగల్ సెల్ అథారిటీ ద్వారా పరిష్కరించవచ్చన్నారు. ఉచిత న్యాయ సలహాల కోసం 15100 నంబరుకు ఫోన్ చేసి సలహాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్సై దీపక్‌కుమార్, పార లీగల్ వాలంటీర్ యాదగిరిగౌడ్, లింగమయ్య, మదర్‌పాషా, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలి

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు గంగారెడ్డి మాట్లాడుతూ.. రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ అమలు చేయాలని, పంటలకు రూ.500 బోనస్ చెల్లించాలనీ, రైతు భరోసా రూ.15 వేలు, ఫసల్ బీమా పథకం అమలు చేయాలని, సబ్సిడీపై రైతులకు యంత్రాలను అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ విక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు మహిపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, లింగారావు, రవీందర్, రాజు, గోపాల్ తదితరులున్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ రాజేశ్ చంద్ర

మాచారెడ్డి: వర్షా కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర అన్నారు. గురువారం పాల్వంచ వాగు ప్రవాహాన్ని పరిశీలించిన అనంతరం మాచారెడ్డి పోలీస్ ఠాణాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలతో వాగులు పొరుతున్నాయని, ఎవరైనా ప్రవాహంలో ఇరుక్కున్నా 100కు కాల్ చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని సూచించారు. ప్రతీ కేసును నిజాయితీతో, నైపుణ్యతతో సమగ్రంగా విచారించి ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రతీ పోలీసు అధికారిపై ఉందన్నారు. ఆయన వెంట ఏఎస్పీ చైతన్యారెడ్డి, రూరల్ సీఐ రామన్, ఎస్సై అనిల్, సిబ్బంది ఉన్నారు.



పాల్వంచ వాగును పరిశీలిస్తున్న ఎస్పీ రాజేశ్

నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

కామారెడ్డి క్రైం: పోలీసు అధికారులు నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. ఏఆర్ విభాగానికి చెందిన కానిస్టేబుల్ జి.సాయిలు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. గురువారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాజేష్ చంద్రను మర్యాదపూర్వకంగా కలవడంతో అభినందించారు.

బాబల్‌గావ్ సమస్యలను పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న చందర్ నాయక్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): రెండు సంవత్సరాల క్రితం విలీన గ్రామంగా ఏర్పడిన బాబల్‌గావ్ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ చందర్ నాయక్ స్పష్టం చేశారు. బుధవారం బాబల్‌గావ్‌ను ఆయన సందర్శించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలో ఇంక ఏ శాఖలు ఉన్నవి, కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండల పరిధిలో ఏ శాఖలు నిర్వహణలోకి వచ్చాయనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ దశరథ్, ఎంపీడీవోలు శ్రీనివాస్, లక్ష్మీకాంత్ రెడ్డి, ఎంఈవో ప్రవీణ్, తదితరులున్నారు.

కమిషనరేట్‌కు తరలిన ఈ–పంచాయతీ ఆపరేటర్లు

కామారెడ్డి క్రైం: తమ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర సంఘం పిలుపు మేరకు అన్ని జిల్లాలలో ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు ఇటీవలే విధులు బహిష్కరించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం అన్ని జిల్లాల నుంచి ఆపరేటర్లు హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి తరలి వెళ్లారు. కమిషనర్‌ను కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్తాని జిల్లా ప్రతినిధులు తెలిపారు. కానీ కార్యాలయంలో కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో కింది స్థాయి అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. స్పష్టమైన హామీ రాలేదని, సమ్మెబాట పట్టే యోచనలో ఉన్నామని పేర్కొన్నారు.

కులాస్‌పూర్‌లో దొంగల బీభత్సం

- తాళం వేసిన 11 ఇళ్లలో చోరీ
- 7.3 తులాల బంగారం, 54 తులాల వెండి, రూ. 3.85 లక్షల నగదు అపహరణ



కులాస్‌పూర్‌లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్ సభ్యులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): కులాస్‌పూర్‌లో దోపిడీ దొంగలు బుధవారం అర్ధరాత్రి బీభత్సం సృష్టించారు. ఏకంగా తాళం వేసి ఉన్న 11 ఇళ్లల్లో దొంగతనానికి పాల్పడ్డారు. గ్రామంలో చోరీ జరిగిన ఇళ్లను సీపీ సాయి చైతన్య, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి గురువారం పరిశీలించి, బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐ సుస్మిత, గ్రామస్తులు తెలిపిన వివరాలు .. గ్రామంలోని తాళం వేసిన సుమారు 11 ఇళ్లను గురువారం ఉదయం స్థానికులు చూడగా, తాళాలు పగలగొట్టి ఉండటంతో ఒక్కొక్కరుగా పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. వేలిముద్రలు సేకరించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఐదారుగురి ఇళ్లల్లోనే నగదు, బంగారం, వెండి చోరీకి గురైనట్లు తెలిసింది. మిగతా వారి ఇళ్లల్లో చోరీకి యత్నించినా.. విలువైన వస్తువులు లేకపోవడంతో వెనుదిరిగారు. ఆయా ఇళ్ల నుంచి మొత్తం 7.3 తులాల బంగారం, 54 తులాల వెండి, రూ.3.85లక్షల నగదు దొంగతనానికి గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

పిల్లులు పట్టేవారి పనేనా?

కులాస్‌పూర్‌లో గురువారం పిల్లులు పడతామని పలువురు గుర్తుతెలియని వ్యక్తులు గ్రామంలో సంచరించారు. ఈక్రమంలో వారే ఎవరికీ అనుమానం రాకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు తాళం వేసిన ఇళ్లను గమనించి రెక్కీ నిర్వహించి, అర్ధరాత్రి చోరీకి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. సుమారు అర్ధరాత్రి 2 గంటల నుంచి 3 గంటల్లోపే నిందితులు ఒకేసారి 11 ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. సుమారు 10మందికిపైగా బృందాలుగా విడిపోయి గంటల వ్యవధిలోనే దొంగతనానికి పాల్పడటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మంకీ క్యాపులు ధరించి, మారణాయుధాలను కూడా వెంట తెచ్చుకున్నట్లు తెలిసింది. ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన దొంగ పదునైన కత్తిని మర్చిపోగా, పోలీసులు దానిని స్వాధీనం చేసుకున్నారు. ఘటన స్థలాన్ని సీపీ సాయి చైతన్య, ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, సీఐ సురేష్‌కుమార్ పరిశీలించారు. నిందితులను పట్టుకునేందుకు 3 ప్రత్యేక బృందాలను నియమించారు. గడిచిన ఏడాది కాలంలో గ్రామంలో రెండుసార్లు దొంగతనాలు జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఐదారు ఇళ్లల్లో ఒకేరోజు చోరీ జరిగినా.. ఇప్పటివరకూ ఆ కేసులో పురోగతిలేదు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బాల్కొండ: మండల కేంద్రంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. బాల్కొండకు చెందిన గుమ్ముల రాజు(48) బైక్‌పై పాత బస్టాండ్ వైపు బయలుదేరాడు. ఎంఈవో కార్యాలయం ఎదుట రెండు ఎద్దులు ఘర్షణ పడుతూ బైక్‌పై వెళ్తున్న రాజును ఢీకొట్టాయి. ఈ ఘటనలో అతడు రోడ్డుపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుమ్ముల రాజు (ఫైల్)

ఇందల్వాయి: ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లవెల్లి గ్రామ శివారులోగల రైల్వేట్రాక్ పక్కన గల గుంతలో ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. గురువారం వ్యక్తి మృతదేహం కనిపించినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, వారు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు సుమారు 35ఏళ్ల నుంచి 45ఏళ్ల లోపు ఉండవచ్చని తెలిపారు. అతడు తెలుపు చొక్కా, నలుపు రంగు పాయింట్ ధరించాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ చోరీల కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్‌వో

కామారెడ్డి క్రైం: బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పట్టణ పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ పీఎస్‌లో గురువారం ఎస్‌హెచ్‌వో నరహరి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన జంగం నగేష్ తన బైక్ చోరీకి గురైనట్లు ఈ నెల 16న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా రెండు బైక్‌లపై వచ్చిన ఇద్దరు యువకులు పోలీసులను చూసిపారిపోబోయారు. వారిని పట్టుకుని విచారించగా బైక్‌ల చోరీలకు పాల్పడినట్లు తెలిసింది. జంగం నగేష్ బైక్‌తో పాటు కామారెడ్డిలోని ఉస్మాన్‌పుర, శ్రీరాంనగర్ కాలనీల్లో ఇదే తరహాలో మరికొన్ని బైక్ లను చోరీ చేసినట్లు నిందితులు అంగీకరించారు. వారి వద్ద నుంచి 5 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై రాజారాం, సిబ్బందిని అభినందించారు.